క్లుప్తంగా

పెరుగుతున్న వరదతో ప్రజల బెంబేలు

పి.గన్నవరం: వశిష్ట, వైనతేయ నదీపాయల్లో వరద ఉధృతి క్రమేపీ పెరుగుతోంది. దీంతో లంక గ్రామాల ప్రజలు ఆందోళన చెందుతున్నారు. బూరుగులంక రేవు వద్ద వశిష్ట నదీపాయలో తాత్కాలిక రహదారి వరద ఉధృతికి కొట్టుకుపోవడంతో ఊడిమూడిలంక, జి.పెదపూడిలంక, అరిగెలవారిపేట, బూరుగులంక గ్రామాల ప్రజలు పడవలపై రాకపోకలు సాగిస్తున్నారు. యర్రంశెట్టివారిపాలెం మీదుగా పశ్చిమ గోదావరి జిల్లాకు చెందిన పెదమల్లంక, ఆనగర్లంక, సిర్రావారిలంక గ్రామాల ప్రజలు పడవలపై పి.గన్నవరం మండలానికి వస్తున్నారు. కనకాయలంక కాజ్‌వే ఆదివారం వరదనీట మునిగే అవకాశం ఉంది. లంకలు వరదనీట మునగడంతో పాడి రైతులు పశువులను ఏటిగట్లకు తరలిస్తున్నారు.

క్షయ వ్యాధి నిర్మూలనకు పరీక్షలు

రాజోలు: క్షయ వ్యాధి నిర్మూలనకు క్షేత్రస్థాయిలో వైద్య పరీక్షలు నిర్వహించి రోగులకు ఉచితంగా మందులు పంపిణీ చేస్తున్నామని డాక్టర్ టి.మణికుమార్ అన్నారు. శనివారం పొన్నమండ పంచాయతీ వద్ద సర్పంచ్ కుక్కల బేబీకుమారి అధ్యక్షతన జరిగిన క్షయ వ్యాధి నిర్మూలన అవగాహన సదస్సులో గోదావరి డెల్టా చైర్మన్ గుబ్బల శ్రీనివాస్ ముఖ్యఅతిథిగా పాల్గొని ప్రసంగించారు. ఈ సందర్భంగా శ్రీనివాస్ మాట్లాడుతూ క్షయ వ్యాధిని పూర్తిస్థాయిలో నివారించాలన్నారు. రాజోలు కో–లోకేటెడ్ ప్రాథమిక ఆరోగ్య కేంద్రం పరిధిలోని అన్ని గ్రామాల్లో టీబీ ముక్త్ భారత్ అభియాన్ కార్యక్రమాలు నిర్వహిస్తున్నారన్నారు. ఎంపీటీసీ కడలి శ్రీదుర్గ, సొసైటీ అధ్యక్షుడు కె.రాజ్‌కుమార్, ఎంపీహెచ్ఈఓ కె.త్రినాథరావు, ఎస్‌టీఎల్ఎస్ జి.సర్వారాయుడు, ఎంఎల్‌హెచ్‌పీ పావని, సుస్మిత, రోజారాణి, సరిత, ఏఎన్ఎం పి.కాంతకుమారి, హెల్త్ అసిస్టెంట్ ఎం.కోటేశ్వరరావు, ఆశ కార్యకర్తలు పాల్గొన్నారు.

కీటక జనిత వ్యాధుల వ్యాప్తిని అరికట్టాలి

రాజోలు: కీటక జనిత వ్యాధుల వ్యాప్తిని అరికట్టాలని రాజోలు సబ్ యూనిట్ ఎన్‌వీబీడీసీపీ సమీక్షా సమావేశ సబ్‌యూనిట్ అధికారి వై.ఆదినారాయణ సూచించారు. శనివారం రాజోలులోని హెల్త్ వెల్‌నెస్ సెంటర్ వద్ద ఆరోగ్య కార్యకర్తలతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆదినారాయణ మాట్లాడుతూ ప్రస్తుత వర్షాల కారణంగా కీటక జనిత వ్యాధులు వ్యాప్తి అధికంగా ఉంటుందన్నారు. ఆరోగ్య సిబ్బంది ప్రతి ఇంటికి తిరుగుతూ దోమలు వ్యాప్తిని అరికట్టేందుకు తీసుకునే చర్యలను ప్రజలకు వివరించాలన్నారు. ముఖ్యంగా లార్వా దశలోనే దోమలను నిర్మూలన చేయాలని, దీని వల్ల వ్యాధులు వ్యాప్తి చెందకుండా చేయవచ్చునన్నారు. ఫ్రైడే–డ్రై డే కార్యక్రమాన్ని మరింతగా చేపట్టాలని, ప్రజలను భాగస్వామ్యం చేయాలన్నారు. సూపర్‌వైజర్ మద్దాల శ్రీనివాస్, సబ్ యూనిట్ పరిధిలోని మగ ఆరోగ్య కార్యకర్తలు పాల్గొన్నారు.

34 మందికి కంటి పరీక్షలు

మామిడికుదురు: లూటుకుర్రు గ్రామ పంచాయతీ కార్యాలయం వద్ద శనివారం ఉచిత కంటి వైద్య శిబిరం ఏర్పాటు చేశారు. మామిడికుదురుకు చెందిన అంజు కంటి ఆసుపత్రి ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన ఈ శిబిరాన్ని సర్పంచ్ అడబాల తాతకాపు ప్రారంభించారు. ఈ శిబిరంలో 34 మందికి ఉచితంగా కంప్యూటర్ ద్వారా పరీక్షలు చేశారు. 10 మందికి కళ్లజోళ్లు అందజేశారు. మరో పది మందిని ఆపరేషన్ల కోసం ఎంపిక చేశారు. కార్యక్రమంలో పంచాయతీ కార్యదర్శి సూర్యనారాయణరాజు, గ్రామ పెద్దలు పాల్గొన్నారు.

అంబాజీపేట వెంకన్నను దర్శించుకున్న పెన్నమరెడ్డి

అంబాజీపేట: స్థానిక కొర్లపాటివారిపాలెంలో వేం చేసి ఉన్న భూ సమేత వేంకటేశ్వరస్వామి వారిని రాష్ట్ర అటవీశాఖ ఐటీ సలహాదారుడు పెన్నమరెడ్డి నాగబాబు శనివారం రాత్రి దర్శించుకున్నారు. ఆలయ అర్చకులు పాణింగపల్లి నరసింహచార్యులు, ఆలయ అభివృద్ధి కమిటీ ఆధ్వర్యంలో నాగబాబుకు ఆలయ మర్యాదలతో ఘన స్వాగతం పలికారు. ప్రత్యేక పూజలు నిర్వహించి తీర్థప్రసాదాలు అందజేశారు. శిరిగినీడి వెంకటేశ్వరరావు, బొంతు పెదబాబు, గణపతి వీర రాఘవులు, మైపాల తాతాజీ, కొర్లపాటి గోపి, కొర్లపాటి డిల్లీ, అరిగెల సూరిబాబు పాల్గొన్నారు.

ముగ్గురికి గాయాలు

అంబాజీపేట: ట్రాక్టర్‌కు తొట్టిని కలిపే ఇచ్‌పిన్ ఊడిపోవడంతో కర్రల లోడుతో వెళ్తున్న ట్రాక్టర్ తిరగబడి ముగ్గురికి గాయాలయ్యాయి. వీరిలో ఒకరి పరిస్థితి విషమంగా ఉండడంతో కొత్తపేట ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. స్థానికుల కథనం ప్రకారం.. అంబాజీపేట మండలం గంగలకుర్రు గుంటమామిడి తోట మీదుగా అంబాజీపేట వైపునకు కర్రల లోడు ట్రాక్టర్ వెళుతూ ఉండడంతో చింతలపూడి కన్వెన్షన్ ఫంక్షన్ హాల్ వద్ద ఉన్న మలుపులో ట్రాక్టర్ తొట్టిని కలిపే ఇచ్ పిన్ ఊడిపోవడంతో పక్కనే ఉన్న కొబ్బరి తోటలోకి ట్రాక్టర్ తొట్టి బోల్తా కొట్టింది. దాంతో కర్రల లోడుపై ఉన్న ముగ్గురు కూలీలకు గాయాలయ్యా యని వీరిలో ఒకరికి తీవ్రంగా గాయపడడంతో కొత్తపేట ప్రభుత్వ ఆసుపత్రికి తరలించినట్టు స్థానికులు తెలిపారు. కాగా ఈ ముగ్గురు రావులపాలెంకు చెందిన వారిగా తెలుస్తోంది.

చంద్రబాబు మోసాలను ప్రజల్లోకి తీసుకెళ్లాలి

- వైఎస్సార్ సీపీ జిల్లా పార్టీ అధ్యక్షుడు జగ్గిరెడ్డి, పార్లమెంటరీ పరిశీలకురాలు విజయలక్ష్మి
- చాకలిపాలెంలో గన్నవరపు ఆధ్వర్యంలో 'బాబు ష్యూరిటీ–మోసం గ్యారంటీ'
- పాల్గొన్న విప్పర్తి, విశ్వరూప్, బోస్, కుడుపూడి, గొల్లపల్లి



రీకాల్ చంద్రబాబు మేనిఫెస్టో క్యూఆర్ కోడ్‌లను ప్రదర్శిస్తున్న జగ్గిరెడ్డి, విప్పర్తి, విశ్వరూప్, బోస్, గన్నవరపు, గొల్లపల్లి



రాజశేఖరరెడ్డి విగ్రహానికి నివాళులు అర్పిస్తున్న నాయకులు

పి.గన్నవరం: ఎన్నికల్లో హామీలు ఇచ్చి అధికారంలోకి వచ్చి వాటిని విస్మరించిన ముఖ్యమంత్రి చంద్రబాబు మోసాలను ప్రశ్నించేలా ప్రజల్లో చైతన్యం తీసుకురావాలని వైఎస్సార్ సీపీ జిల్లా అధ్యక్షుడు చిర్ల జగ్గిరెడ్డి, పార్లమెంటు పరిశీకురాలు జక్కంపూడి విజయలక్ష్మి పిలుపునిచ్చారు. చాకలిపాలెంలోని కృష్ణ బాలాజీ కన్వెన్షన్ హాలులో శనివారం పి.గన్నవరం నియోజకవర్గ విస్తృత స్థాయి సమావేశం, బాబు ష్యూరిటీ–మోసం గ్యారంటీ కార్యక్రమం నియోజకవర్గ కోఆర్డినేటర్ గన్నవరపు శ్రీనివాసరావు అధ్యక్షతన జరిగింది. ఈ సందర్భంగా జగ్గిరెడ్డి మాట్లాడుతూ రీకాలింగ్ చంద్రబాబు మేనిఫెస్టో కార్యక్రమాన్ని క్యూఆర్ కోడ్ రూపంలో ప్రజల్లోకి తీసుకువెళ్లి చంద్రబాబు దగాకోరు తనాన్ని వివరించాలని పార్టీ శ్రేణులకు సూచించారు. మండల, గ్రామ, బూత్ స్థాయిలో కార్యకర్తలు సమావేశమై ఈ కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని అన్నారు. చంద్రబాబు మోసాలను ఎండగట్టాలని సూచించారు. రాబోయే రోజుల్లో కార్యకర్తలకు అత్యంత ప్రాధాన్యత ఇచ్చే విధంగా పార్టీ అధినేత జగన్‌మోహనరెడ్డి పాలన ఉంటుందని అన్నారు. పార్టీ కార్యకర్తలకు ఇన్సూరెన్స్ చేయించే కార్యక్రమం కూడా త్వరలో జరుగుతుందని జగ్గిరెడ్డి అన్నారు. విజయలక్ష్మి మాట్లాడుతూ ప్రస్తుతం రాష్ట్రంలో అరాచక పాలన కొనసాగుతోందని ఆగ్రహం వ్యక్తం చేశారు. కాకినాడ మెడికల్ కళాశాలలో 50 మంది విద్యార్థినులపై లైంగిక వేధింపులు జరుగుతుంటే కూటమి పాలకుల నోళ్లు ఎందుకు మూతబడ్డాయని ఆమె ప్రశ్నించారు.

జిల్లా పరిషత్ చైర్మన్ విప్పర్తి వేణుగోపాలరావు మాట్లాడుతూ దేశంలో ఎక్కడా లేని విధంగా సంక్షేమ పథకాలను అమలు చేసిన ఘనత జగన్‌కే దక్కిందన్నారు. ఊడిమూడి, జి.పెదపూడి గ్రామాల ప్రజల వరద కష్టాలు తెలుసుకున్న జగన్ అక్కడ రూ.50 కోట్లతో వంతెన పనులు ప్రారంభించారని గుర్తు చేశారు. పార్లమెంటు నియోజకవర్గ కోఆర్డినేటర్, మాజీ మంత్రి పినిపే విశ్వరూప్ మాట్లాడుతూ చంద్రబాబు పేరు చెబితే వెన్నుపోటు అనే పదం గుర్తుకు వస్తుందని అన్నారు. ఎన్నికల్లో ఎన్నో హామీలిచ్చి అధికారంలోకి వచ్చాక మేనిఫెస్టోనే మాయం చేసిన ఘనత ఆయనకే దక్కిందన్నారు. సచివాలయ వ్యవస్థ ద్వారా 1.25 లక్షల మందికి ప్రభుత్వ ఉద్యోగాలు ఇచ్చిన దేశంలోనే ఏకైక సీఎం జగన్ అని అన్నారు. రాజ్యసభ సభ్యుడు పిల్లి సుభాష్ చంద్రబోస్ మాట్లాడుతూ పార్టీ శ్రేణులు ఐక్యంగా పని చేసి బాబు ష్యూరిటీ–మోసం గ్యారెంటీ కార్యక్రమాన్ని ప్రజల్లోకి తీసుకువెళ్లాని సూచించారు. ఎమ్మెల్సీ కుడుపూడి సూర్యనారాయణరావు మాట్లాడుతూ రాష్ట్రంలో కూటమి ప్రభుత్వం పోలీసులతో బెదిరించి రాక్షస పరిపాలన సాగిస్తోందని అన్నారు. పోలీసుల వేధింపులకు భయపడొద్దని, పార్టీ నేతలు అండగా ఉంటారని నాయకులకు, కార్యకర్తలకు సూచించారు. పి.గన్నవరం కోఆర్డినేటర్ గన్నవరపు శ్రీనివాసరావు మాట్లాడుతూ జగన్ మళ్లీ అధికారంలోకి వస్తేనే పేదలకు న్యాయం జరుగుతుందన్నారు. రాజోలు కోఆర్డినేటర్ గొల్లపల్లి సూర్యారావు మాట్లాడుతూ కూటమి ప్రభుత్వానికి ప్రజలు తగిన బుద్ధి చెప్పే రోజులు దగ్గర పడ్డాయన్నారు. రామచంద్రాపురం కోఆర్డినేటర్ పిల్లి సూర్యప్రకాష్, మాజీ ఎమ్మెల్యే పాముల రాజేశ్వరీదేవి, నియోజకవర్గ పరిశీలకులు పెన్మత్స చిట్టిరాజు మాట్లాడుతూ వచ్చే ఎన్నికల్లో జగన్‌ను సీఎంగా చేయడమే లక్ష్యంగా పార్టీ శ్రేణులు పనిచేయాలని అన్నారు. తొలుత కోఆర్డినేటర్ గన్నవరపు ఆధ్వర్యంలో రాజశేఖరరెడ్డి విగ్రహానికి నాయకులు నివాళులు అర్పించారు. ముఖ్య అతిథులను గన్నవరపు ఘనంగా సత్కరించారు. కార్యక్రమంలో పార్టీ మండల అధ్యక్షుడు యన్నాబత్తుల ఆనంద్, ఎంపీపీలు దొమ్మేటి వెంకటేశ్వరరావు, కుసుమ వనజాకుమారి, జెడ్పీటీసీ బూడిద వరలక్ష్మి, రాష్ట్ర నాయకులు మందపాటి కిరణ్‌కుమార్, చెల్లుబోయిన శ్రీనివాస్, మట్టపర్తి పండు, అడ్డగళ్ల వెంకటసాయిరామ్, దొమ్మేటి వెంకటశివరామ్, కుడుపూడి విద్యాసాగర్, నక్కా వెంకటేశ్వరరావు, వాసంశెట్టి తాతాజీ, మెల్లం ప్రసాద్, పితాని నర్సింహరావు, జక్కంపూడి వాసు, పేరి శ్రీను, దొమ్మేటి సత్యమోహన్, రుద్రరాజు చిన్నరాజు, వక్కలంక రాధాకృష్ణ, కుడుపూడి సత్యశైలజ, నీతిపూడి గణేష్‌బాబు, తోరం గౌతమ్, ఎం.శిరీష్ తదితరులు పాల్గొన్నారు.

కనకమహాలక్ష్మి అమ్మవారికి ఆషాఢం సారె సమర్పణ



అప్పనపల్లి గ్రామ దేవతకు సారె తీసుకు వస్తున్న మహిళలు



కనకమహాలక్ష్మి అమ్మవారికి సమర్పించిన పలు రకాల స్వీట్లు

మామిడికుదురు: అప్పనపల్లి గ్రామ దేవత కనకమహాలక్ష్మి అమ్మవారికి శనివారం ఆషాఢం సారె సమర్పించారు. మహిళలు ఊరేగింపుగా వచ్చి అమ్మవారికి సారె సమర్పించారు. సామాజిక సమరసత వేదిక ఆధ్వర్యంలో ఈ కార్యక్రమం ఆద్యంతం కన్నుల పండుగలా జరిపించారు. గ్రామంలోని అన్ని ప్రాంతాల్లో ఉన్న రామాలయాల నుంచి మహిళలు ఊరేగింపుగా సారె తీసుకుని శివాలయం వద్దకు చేరుకున్నారు. అక్కడ నుంచి భారీ ఊరేగింపుగా అమ్మవారికి ఆలయానికి చేరుకుని సారె సమర్పించారు. అమ్మవారి సన్నిధిలో నిర్వహించిన ప్రత్యేక పూజల్లో పాల్గొన్నారు. ఆలయ ధర్మకర్తల మండలి చైర్మన్ తులా నాగరాజు, వేదిక ప్రతినిధులు బైరిశెట్టి కోటేశ్వరరావు, పాటి గంగాసత్యనారాయణ, పెచ్చెట్టి సత్యనారాయణమ్మ, వాకా వరలక్ష్మి, కంకిపాటి సుబ్బారావు తదితరులు పాల్గొన్నారు.

శాకంబరీ దేవిగా పోలేరమ్మ తల్లి

ఆలమూరు: మడికిలో ఉన్న గ్రామదేవత పోలేరమ్మ అమ్మవారు శనివారం శాకంబరిగా భక్తులకు దర్శనమిచ్చారు. గ్రామ ఆడపడుచులు ఊరేగింపుగా వెళ్లి అమ్మవారికి ఆషాఢం సారెను సమర్పించారు. సుమారు 1500 కిలోల వివిధ రకాల కూరగాయలు, పండ్లు, పుష్పాలతో అమ్మవారిని సర్వాంగ సుందరంగా అలంకరించారు.

ఉప్పొంగిన గోదావరి



ముక్తేశ్వరం వృద్ధగౌతమి పాయపై పాత వంతెనను తాకిన వరదనీరు

అయినవిల్లి: ముక్తేశ్వరం–కోటిపల్లిరేవులో గోదావరి ఉధృతిగా ప్రవహిస్తుంది. లంక గ్రామాల్లో పంట పొలాలు మునిగిపోయాయి. కూరగాయ, అరటి, తదితర వాణిజ్య పంటల రైతులు తీవ్రంగా నష్టపోయారు. గోదావరి ఉధృతికి లంకలో పశువులను రైతులు సురక్షిత ప్రాంతాలకు తరలిస్తున్నారు. పంట ఉత్పత్తులు పడవలపై తరలిస్తున్నారు. ముక్తేశ్వరం వృద్ధగౌతమి(తొగరపాయ)పాయలో వరద ఉధృతి కొనసాగుతోంది. వృద్ధగౌతమి పాయపైన పాత వంతెనను వరదనీరు తాకింది. స్నానాల ఘాట్‌లను వరద నీరు ముచ్చేదింది. ముక్తేశ్వరం వృద్ధగౌతమిపాయ వద్ద శ్మశాన వాటిక వరదనీటితో ముంపునకు గురైయింది.

వరద ప్రభావిత ప్రాంతాల్లో పర్యటన



వరద ప్రభావిత ప్రాంతాలను పరిశీలిస్తున్న ఎలక్ట్రికల్ ఏఈ సీహెచ్ రాజేంద్ర, సిబ్బంది

అయినవిల్లి: వరద ప్రభావిత ప్రాంతాలైన అయినవిల్లి లంక, మడుపల్లి, చింతనలంక, శానపల్లిలంక, పొట్టిలంక, కొండుకుదురులంక గ్రామాల్లో ఎలక్ట్రికల్ ఏఈ సీహెచ్ రాజేంద్ర శనివారం పర్యటించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వరద ప్రభావిత ప్రాంతాల్లో వరద ఉధృతి పెరిగితే పగలు విద్యుత్ సరఫరా నిలిపి వేసి రాత్రి సమయంలో విద్యుత్ సరఫరా ఇస్తామన్నారు. ఈ సమయంలో పడవలు, బోట్లు ప్రజలకు సాయం అందించేందుకు అధికారులు వినియోగిస్తారన్నారు. ఈ సమయంలో విద్యుత్ సరఫరా ఉంటే ప్రమాదాలు జరగవచ్చునని ఆ సమయంలో పూర్తి విద్యుత్ సరఫరాను నిలిపివేస్తామని ఆయన తెలిపారు. విద్యుత్ లైన్ల లేని చోట తర్వలో ఏర్పాటు చేస్తున్నామన్నారు. సిబ్బంది ఇబ్బందులు కూడా వరదల సమయంలో వారితో పనులు చేయించుకోవచ్చునన్నారు. ఆయన వెంట అయినవిల్లి లైన్‌మెన్ ఏసు తదితరులు ఉన్నారు.

తేనెటీగల పెంపకంపై శిక్షణ

అంబాజీపేట: కృషీవల కోకోనట్ ఫార్మర్స్ ప్రొడ్యూసర్స్ కంపెనీ ఆధ్వర్యంలో అయినవిల్లి మండలం నేదునూరులో తేనెటీగల పెంపకంపై ఏడు రోజులు పాటు శిక్షణ ఇవ్వనున్నట్లు కంపెనీ అధ్యక్షుడు గణపతి వీర రాఘవులు అన్నారు. అంబాజీపేట కృషివల కోకోనట్ ఫార్మర్స్ ప్రొడ్యూసర్స్ కంపెనీ కార్యాలయంలో తేనెటీగల పెంపకంపై కంపెనీ సీఈఓ అడ్డాల గోపాలకృష్ణ అధ్యక్షతన శనివారం రైతులకు అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా వీర రాఘవులు మాట్లాడుతూ అదనపు ఆదాయానికి తేనెటీగల పెంపకం ఎంతో దోహదపడుతుందన్నారు. ఈ శిక్షనను ప్రతి ఒక్కరూ సద్వినియోగం చేసుకోవాలని ఆయన కోరారు. తేనెటీగల పెంపకంపై నటరాజ్ శిక్షణ ఇచ్చారు. కార్యక్రమంలో రైతు సంఘం ప్రతినిధులు ముత్యాల జమ్మిలు, దంగేటి గిరిధర్, నిట్టాల సాయిరాం, ముత్యాల సత్తిబాబు, ఉప్పుగంటి భాస్కరరావు, శివరామకృష్ణ రాజు, పిల్ల దొరబాబు పాల్గొన్నారు.

కేశవదాసుపాలెంలో పశుగ్రాస వారోత్సవాలు

సఖినేటిపల్లి: కేశవదాసుపాలెంలో శనివారం పశు సంవర్ధక శాఖ ఆధ్వర్యంలో పశుగ్రాస వారోత్సవాలు నిర్వహించారు. ఈ సందర్భంగా రైతులకు వివిధ పశుగ్రాసాలపై పశువైద్యాధికారి బీబీ సంపత్ కుమార్ అవగాహన కల్పించారు. అలాగే 75 శాతం సబ్సిడీపై సరఫరా చేస్తున్న పశుగ్రాసం విత్తనాలను రైతులు సద్వినియోగం చేసుకోవాలని ఆయన సూచించారు. ఎంపీటీసీ ఉండపల్లి సాయికుమారి, బి.జానకి రామారావు, యు.వెంకటేశ్వరరావు, ఆచంట పండు తదితరులు పాల్గొన్నారు.

వేంకటేశ్వరునికి పూజలు


అయినవిల్లి: నల్లచెరువు గ్రామంలో ఉన్న అలిమేలు మంగ, పద్మావతి సమేత వేంకటేశ్వరస్వామి వారి ఆలయానికి శనివారం భక్తులు పోటెత్తారు. స్వామివారి దర్శనం కోసం తెల్లవారు జాము నుంచి భక్తులు పెద్ద ఎత్తున బారులు తీరారు. స్వామివారికి ఆలయ వేదపండితులు ఆధ్వర్యంలో తెల్లవారు జాము నుంచి ప్రత్యేక పూజలు, అభిషేకాలు నిర్వహించారు.వేదపండితులు స్వామికి లక్ష తులసీ పూజ నిర్వహించారు. ఈ సందర్భంగా స్వామిని వివిధ పుష్పాలతో సర్వాంగ సుందరంగా అలంకరించారు. భక్తులకు అన్నదానం చేశారు. స్వామివారికి భక్తులు పటికి బెల్లం తులాభారం నిర్వహించి మొక్కు తీర్చుకున్నారు. అయినవిల్లి విఘ్నేశ్వరస్వామి వారి ఆలయంలో భక్తులు సందడి చేశారు. స్వామివారికి వివిధ పూజలు ద్వారా రూ.3,27,308 ఆదాయం లభించింది. స్వామివారి అన్నదాన ప్రసాదాన్ని 2600మంది భక్తులు స్వీకరించారు.

వ్యక్తి అదృశ్యం

పి.గన్నవరం: గాజులగుంట గ్రామానికి చెందిన పిల్లి వెంకట రమణ అనే వ్యక్తి ఇంటి నుంచి అదృశ్యమైన ఘటనపై శనివారం కేసు నమోదు చేసినట్టు ఎస్సై బి.శివకృష్ణ తెలిపారు. గత నెల 24న వెంకట రమణ పనికి వెళ్తున్నట్టు చెప్పి, ఇంటి నుంచి బయటకు వెళ్లాడు. అతడు ఇంటికి తిరిగి రాకపోవడంతో పరిసర ప్రాంతాలు, బంధువుల ఇళ్లు గాలించారు. అయినప్పటికీ అతడి ఆచూకీ తెలియక పోవడంతో భార్య దుర్గాలక్ష్మి పోలీసులకు ఫిర్యాదు చేసింది. దీనిపై కేసు దర్యాప్తు చేస్తున్నట్టు ఎస్సై శివకృష్ణ వివరించారు.

కూటమి పాలనలో
చేనేత కుటుంబాలకు అన్యాయం

మాజీ మంత్రి గొల్లపల్లి సూర్యారావు



మలికిపురంలో మాజీ మంత్రి గొల్లపల్లిని సన్మానిస్తున్న జాన జగదీష్ చంద్ర గణేష్

మలికిపురం: కూటమి పాలనలో రాష్ట్రంలో చేనేత కుటుంబాల జీవనం చిద్రం అయిందని మాజీ మంత్రి గొల్లపల్లి సూర్యారావు పేర్కొన్నారు. శనివారం మలికిపురం పార్టీ కార్యాలయంలో పార్టీ చేనేత విభాగం జిల్లా అధ్యక్షులు జాన జగదీష్ చంద్ర గణేష్ ఆధ్వర్యంలో జరిగిన సమావేశంలో సూర్యారావు మాట్లాడారు. మాజీ సీఎం జగన్ హయాంలో చేనేత కుటుంబాలకు ప్రతి ఏడాది రూ.18 వేల నగదు జమ చేసి ఆ కుటుంబాలను ఆదుకున్నామన్నారు. ప్రస్తుతం ప్రభుత్వ ఆదరణ లేక అనేక చేనేత కుటుంబాలు జీవనాధారం లేక అల్లాడుతున్నాయన్నారు. కూటమి పాలనలో ఏడాది కాలంలో లక్షా 75 వేల కోట్లు అప్పులు చేసి ఏం చేశారని ప్రశ్నించారు. జగన్ అమలు చేసిన పథకాలు కూడా అమలు చేయని ఈ ప్రభుత్వం ఆ అప్పులను ఏం చేశారని సూర్యారావు ప్రశ్నించారు. జగన్ పెంచిన పింఛన్లు తప్ప ఏ పథకం అమలు చేస్తున్నారని చెప్పారు. ఏడాది అయిన ఉచిత బస్ పథకం లెక్కల్లో లేదని విమర్శించారు. సమావేశంలో పార్టీ రాష్ట్ర సంయుక్త కార్యదర్శి రుద్రరాజు చిన్నారాజా, నాయకులు చింతా సుధాకర్, తాడి సహదేవ్, బల్ల సత్యనారాయణ, అడబాల జానకీ రామ్, ఇనుమర్తి వీర నాగరాజు తదితరులు పాల్గొన్నారు.

బాలికల వసతి గృహం ఆకస్మిక తనిఖీ



బాలికలతో కలిసి భోజనం చేస్తున్న ఆర్డీఓ శ్రీకర్, తహసీల్దార్ రాంబాబు

కొత్తపేట: స్థానిక ప్రభుత్వ సాంఘిక సంక్షేమ బాలికల వసతి గృహాన్ని ఆర్డీఓ పీ శ్రీకర్ తహసీల్దార్ వై.రాంబాబుతో కలిసి శనివారం ఆకస్మికంగా తనిఖీ చేశారు. వసతి గృహంలో విధులు నిర్వహిస్తున్న అధికారి, సిబ్బందితో మౌలిక సదుపాయాలు, భోజన నాణ్యత తదితర అంశాలపై సమీక్షించారు. అలాగే హాస్టల్ విద్యార్థినులతో మాట్లాడి ప్రభుత్వం అందిస్తున్న సౌకర్యాలు, భోజనం నాణ్యత, ఇతర మౌలిక సౌకర్యాలపై వారి అభిప్రాయం అడిగి తెలుసుకున్నారు. భోజనం నాణ్యత పరిశీలనలో భాగంగా ఆర్డీఓ, తహసీల్దార్ విద్యార్థినులతో కలసి భోజనం చేశారు. బాలికల హాస్టల్‌తో అన్ని మౌలిక సదుపాయాలు, భోజనం నాణ్యత విషయంలో ఎటువంటి అలసత్వం వహించరాదని సంబంధిత హాస్టల్ అధికారి హేమలతను, సిబ్బందిని ఆదేశించారు.

ప్రజల సంపూర్ణ ఆరోగ్యమే లక్ష్యం

- జిల్లా మలేరియా అధికారి వెంకటేశ్వరరావు
- కొత్తపేటలో హెల్త్ అసిస్టెంట్ల అవగాహన సదస్సు



కొత్తపేటలో హెల్త్ అసిసెంట్లతో సమీక్షిస్తున్న డీఎంఓ వెంకటేశ్వరరావు

కొత్తపేట: సంపూర్ణ ప్రజారోగ్యం లక్ష్యంగా పీహెచ్‌సీల హెల్త్ అసిస్టెంట్స్, ఆరోగ్య కార్యకర్తలు పని చేయాలని జిల్లా మలేరియా అధికారి (డీఎంఓ) డాక్టర్ ఎం వెంకటేశ్వరరావు సూచించారు. ప్రస్తుతం వర్షాకాలం, వ్యాధుల సీజన్ నేపథ్యంలో గ్రామాల్లో దోమల లార్వా నియంత్రణ తద్వారా దోమల నివారణపై వైద్య, ఆరోగ్య శాఖ కొత్తపేట, రావులపాలెం సబ్ యూనిట్ల పరిధిలోని కొత్తపేట, రావులపాలెం, ఆత్రేయపురం, ఆలమూరు, అయినవిల్లి, అంబాజీపేట మండలాల హెల్త్ అసిస్టెంట్లకు శనివారం మధ్యాహ్నం స్థానిక మండల పరిషత్ కార్యాలయం సమావేశం హాలులో సమీక్షా సమావేశం నిర్వహించారు. కొత్తపేట, రావులపాలెం సబ్ యూనిట్ల అధికారులు ఎస్ రాజబాబు, సీహెచ్ వెంకటేశ్వరరావు ఆధ్వర్యంలో నిర్వహించిన ఈ కార్యక్రమంలో డీఎంఓ వెంకటేశ్వరరావు పాల్గొన్నారు. గ్రామాల్లోని డ్రైన్లు, నీటి నిల్వల్లో లార్వా, దోమల ఉధృతిని గురించి, వాటి నివారణకు తీసుకుంటున్న చర్యల్లో భాగంగా ఎదురవుతున్న పరిస్థితులను హెల్త్ అసిస్టెంట్లను అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా డీఎంఓ మాట్లాడుతూ వాతావరణం మార్పుల వలన జ్వరాలు, దోమలు కుట్టడం వలన వివిధ వ్యాధులు వస్తాయన్నారు. ప్రస్తుత వాతావరణం దోమలు వృద్ధి చెందడానికి దోహదపడుతుందన్నారు. ఇంటి పరిసరాల్లో దోమలు ఎక్కువగా వృద్ధి చెందకుండా పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలని, నీటి నిల్వలు లేకుండా చూసుకునేలా ప్రజలకు అవగాహన కల్పించాలన్నారు. రక్షిత మంచినీటి పథకాల ట్యాంకులు క్లోరినేషన్ చేయించాలని సూచించారు. ఇంకా పలు సూచనలు, సలహాలు ఇచ్చారు. ఈ కార్యక్రమంలో ఆరు మండలాల నుంచి హెల్త్ అసిస్టెంట్స్ పాల్గొన్నారు.

పలువురికి జగ్గిరెడ్డి పరామర్శ



నార్కెడిమిల్లిలో నరసింహారావు కుటుంబాన్ని పరామర్శిస్తున్న చిర్ల జగ్గిరెడ్డి

కొత్తపేట: ఆత్రేయపురం మండలంలో పలువురు వ్యక్తులను, పలు కుటుంబాలను జిల్లా వైఎస్సార్ సీపీ అధ్యక్షుడు, మాజీ ఎమ్మెల్యే చిర్ల జగ్గిరెడ్డి శనివారం పరామర్శించారు. నార్కెడిమిల్లి గ్రామంలో పార్టీ నాయకుడు బైరిశెట్టి శ్రీను గుండెకు సంబంధించిన వైద్యం చేయించుకుని ఇంటి వద్ద విశ్రాంతి తీసుకుంటున్నారు. ఆయనను జగ్గిరెడ్డి కలిసి ఆరోగ్యం గురించి అడిగి తెలుసుకున్నారు. తండ్రి వియోగంతో బాధపడుతున్న పోతురెడ్డి నరసింహరావుని, సాధనాల సత్యం, పిట్టా సత్యవతి ఇటీవల మృతి చెందగా వారి కుటుంబ సభ్యులను జగ్గిరెడ్డి పరామర్శించారు. మృతుల చిత్రపటాలకు పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఆయన వెంట ఆ గ్రామ సర్పంచ్, వైఎస్సార్ సీపీ పంచాయతీ రాజ్ విభాగం నియోజకవర్గ అధ్యక్షుడు పాలా నాగేశ్వరావు, ఎంపీటీసీ సభ్యుడు పాల చిన్న వెంకటరమణ, ఎంపీటీసీ మాజీ సభ్యుడు బాలం బాబూరావు, ఉప సర్పంచ్ పోతురెడ్డి సురేష్, వైఎస్సార్ సీపీ నాయకులు, కార్యకర్తలు ఉన్నారు.

నేడు ఫ్రీ బోన్ మినరల్ డెన్సిటీ క్యాంపు

కొత్తపేట: స్థానిక సందీప్ ఐ క్లినిక్ ప్రాథమిక కంటి ఆసుపత్రి వద్ద ఆదివారం ఉదయం ఫ్రీ బోన్ మినరల్ డెన్సిటీ క్యాంపు నిర్వహిస్తున్నట్టు సందీప్ చారటబుల్ ట్రస్ట్ చైర్మన్ బండారు పెదవెర్రియ్య (చిట్టిబాబు) శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. రాజమహేంద్రవరం యూనివర్సల్ హాస్పిటల్ నిర్వహించే ఈ శిబిరంలో ఎముకలు, కీళ్ల వ్యాధుల వైద్య నిపుణులు డాక్టర్ రాజేంద్రబాబు ఆరుమిల్లి ఆధ్వర్యంలో రూ.4 వేలు విలువ గల బోన్ మినరల్ డెన్సిటీ టెస్ట్ ఉచితంగా చేస్తారని తెలిపారు. శ్రీవెంకట సందీప్ ఐ క్లినిక్ ప్రాథమిక కంటి ఆస్పత్రి వారితో కంటి పరీక్షలు నిర్వహించి, అవసరమైన వారికి ఉచితంగా ఆపరేషన్ చేయిస్తారని తెలిపారు. ఈ రెండు విభాగాల ఉచిత వైద్య పరీక్షల అవకాశాలను సద్వినియోగం చేసుకోవాలని చిట్టిబాబు కోరారు.

నేడు శాకంబరిగా దర్శనమివ్వనున్న అమ్మవారు

సఖినేటిపల్లి: అంతర్వేది పుణ్యక్షేత్రంలో కొలువైన గుర్రాలక్క అమ్మవారికి ఆదివారం శాకంబరిగా అలంకరణ నిర్వహించనున్నట్టు అంతర్వేది దేవస్థానం అసిస్టెంట్ కమిషనర్ ఎంకేటీఎన్‌వీ ప్రసాద్ శనివారం తెలిపారు. శాకంబరిగా గుర్రాలక్క అమ్మవారిని దర్శించుకుని, అమ్మవారి తీర్థ ప్రసాదాలను స్వీకరించాలని ఆయన భక్తులకు విజ్ఞప్తి చేశారు.

మహిళల హక్కులను పరిరక్షించుకోవాలి

ఆలమూరు: ఎన్నికల్లో ఇచ్చిన హామీ ప్రకారం మహిళల హక్కులన్నింటిని అమలు చేసే వరకూ పోరాటం సాగించాలని రాష్ట్ర మహిళ సమాఖ్య అధ్యక్ష, కార్యదర్శులు విమల, దుర్గా భవానీ పిలుపునిచ్చారు. ఆలమూరులోని సమత స్వచ్ఛంద సంస్థ కార్యాలయంలో శనివారం మహిళ జిల్లా సమాఖ్య ప్రథమ మహాసభలు జరిగాయి. ఈ కార్యక్రమానికి మండల మహిళ సమాఖ్య ప్రతినిధి గండి పద్మ అధ్యక్షత వహించగా రాష్ట్ర మహిళ నేతలు పాల్గొని ప్రసంగించారు. సూపర్ సిక్స్ హామీల్లో ఒకటైన ఉచిత బస్సు ప్రయాణంపై ప్రభుత్వ స్పష్టమైన ప్రకటనను విడుదల చేయాలని డిమాండు చేశారు. రాష్ట్రంలో విచ్చలవిడిగా లభ్యమవుతున్న మత్తు పదార్థాలు, గంజాయిని పూర్తిగా అరికట్టాలన్నారు. అనంతరం న్యాయబద్ధమైన మహిళల డిమాండ్లను నెరవేర్చాలనలి కోరుతూ భారీ ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా 15 మందితో కూడిన జిల్లా మహిళా సమాఖ్య నూతన సభ్యుల ఎంపిక చేశారు.